

బాధ్యతలు చేపట్టిన డీఈవో

ప్రజాశక్తి-కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒగా మీనాక్షి గురువారం నాడు బాధ్యతలు చేపట్టారు. నెల రోజుల క్రితం ఆమె ప్రయాణిస్తున్న కారు రామగిరి మండలంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మీనాక్షి గాయపడడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. అనంతరం వైద్యుల సలహాల మేరకు విశ్రాంతి తీసుకున్నారు. ఆరోగ్య కుదుట పడడంతో గురువారం నాడు ఆమె తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పెనుగొండ డిప్యూటీ డిఇఒ రంగస్వామి ఇన్‌ఛార్జి డిఇఒగా కొనసాగారు. ఆయన నుంచి మీనాక్షి బాధ్యలు చేపట్టారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ మీనాక్షి



బియ్యం తూకం మిషన్‌లో ఉంచిన రాయి



దాడిలో గాయపడిన వాలంటీర్

బియ్యం తూకంలో మోసం

ప్రశ్నించిన వాలంటీర్‌పై రేషన్ షాపు నిర్వాహకుడి దాడి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యం, రాగుల తూకంలో మోసం చేస్తున్న ఎండిఎం వాహనదారున్ని ఓ వాలంటీర్ ప్రశ్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన రేషన్ షాపు డీలర్ తన అనుచరులతో ఆ వాలంటీర్‌ను చితకబాదాడు. దీంతో వాలంటీర్ తీవ్ర గాయాలతో కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఓబుళదేవచెరువు మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి బాధితుడు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... ఓబుళచెరువు మండల కేంద్రంలో అబ్దుల్ జబ్బార్ అనే బియ్యం రవాణా వాహనదారుడు సంబంధిత ప్రాంతంలో పేదలకు బియ్యం, రాగులు పంపిణీ చేస్తున్నాడు. బియ్యం తూకం సమయంలో ఒక కేజీ రాయిని స్కేల్ పక్కనబెట్టి తూకం వేస్తున్న విషయాన్ని వాలంటీర్ ఇర్ఫాన్ గమనించి దీనిని ప్రశ్నించాడు. ఇదే విధంగా రాగులు తూకంలో మూడు కిలోల రాళ్ల స్థానంలో నీటి మోటర్ ఉపయోగించే రెండు కిలోల ఇనుప దిమ్మె పెట్టి తూకం వేస్తున్న విషయాన్ని ప్రశ్నించాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన జబ్బర్‌తో అతని సమీప బంధువులు నలుగురు వాలంటీర్ ఇర్ఫాన్‌ను ఇనుపరాడ్లతో చితకబాదారు. తీవ్ర గాయాలకు గురైన ఇర్ఫాన్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన కదిరి ఆసుపత్రికి తరలించారు. దాడి సమయంలో వీడియో తీస్తున్న వారి సెల్‌ఫోన్లను లాక్కొన్నారని, తనజేబులో ఉన్న రూ.పదివేల నగదునూ లాక్కున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బాధితుడు గురువారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తూకంలో మోసం చేస్తూ, దానిని ప్రశ్నించిన వాలంటీర్‌పై దాడి చేసిన బియ్యం రవాణా దారుడు జబ్బర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈనెల 8వ తేదీ రైతు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో 8వ తేదీ ఉదయం పుట్టపర్తి విమానాశ్రయంకు ఆయన రానున్నారు. ముఖ్యమంత్రి వస్తున్న సందర్భంగా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ పి.అరుణ్ బాబు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి భద్రతా అధికారి రామకృష్ణారెడ్డి, ఎస్పీ ఎస్‌వి.మాధవరెడ్డి, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ, ఆర్డీవో భాగ్యరేఖ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కాన్వయ్‌లో వైద్య ఆరోగ్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్ల, అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఏ పనికైనా పైసలివ్వాల్సిందే..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి


అవినీతి రహిత పాలన అందిస్తామని ప్రభుత్వం ఒకవైపు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో ఏ పనికైనా కాసులివ్వాల్సిందేనన్న చందంగా తయారయింది సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పనితీరు. సబ్ రిజిస్ట్రార్లు పోటీ పడి ప్రజల నుంచి కాసులు గుంజుతున్నారు. వరుసగా అవినీతి నిరోధక శాఖ వలలో నెలల వ్యవధిలోనే అనంతపురంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు అవినీతి నిరోధక శాఖ అధికారుల చేతికి చిక్కారు. అనంతపురం రూరల్, అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో లక్షల్లో డబ్బులు వసూలు చేస్తూ రెండు చోట్లా ఎసిబి అధికారులకు పట్టుబడటం గమనార్హం.

కాసులిస్తేనే ఏ పనైనా... భూమి విలువను బట్టి వసూలు..

భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇది సబ్ రిజిస్ట్రార్ సిబ్బందికి కాసులు కురిపిస్తున్నాయి. ఏ పని జరగాలన్నా పైసలివ్వాల్సిందే. ఇవ్వకుంటే సక్రమమైందైనా ముందుకు కదలదు. డబ్బులిస్తే సరైంది కాకపోయినా పని జరిగిపోతుంది. అది కూడా ఆ ప్రాంతంలో బహిరంగ మార్కెట్‌లోనున్న ధర ప్రకారం డబ్బులు చెల్లించాలి. లేకపోతే అది పెండింగ్ రిజిస్ట్రేషన్‌లో పడిపోతుంది. ధర కుదిరితే నిషేధిత భూముల జాబితాలోనున్నా సరే పనైపోతుంది. చిన్నపాటి సవరణలున్నా కాసులివ్వాల్సిందే. వాటి కూడా పెద్ద ఎత్తునే ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో



అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయలో తనిఖీలు చేస్తున్న ఎసిబి అధికారులు


సామాన్య జనం భూముల సమస్య అంటేనే భయపడిపోయే పరిస్థితి నెలకొంది. తాజాగా పట్టుబడిన సత్యనారాయణమూర్తి కూడా దాన విక్రయంకు లక్షల్లో డిమాండ్ చేయడం గమనార్హం. వారి ఆస్తిని వారు మరొకరికి ఇచ్చుకున్నందుకు కూడా రెండు లక్షలు డిమాండ్ చేశారు. ఇక సమస్యాత్మకమైతే ఈ ధర మరింత అధికంగా ఉంటుంది.

రైటర్లే ఆదాయ మార్గం

పత్రాలు రాసే రైటర్లే సబ్ రిజిస్ట్రార్లకు ప్రధాన ఆదాయ మార్గంగా ఉంటున్నారు. వారి ద్వారానే ఈ బేరసారాలు జరుగుతున్నాయి. దీనికితోడు సహాయకులను అటు రైటర్లు, ఇటు సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు ప్రత్యేకంగా నియమించుకుని వసూలు చేయడం జరుగుతోంది. అనంతపురంలో పట్టుబడిన రెండు కేసుల్లోనూ ఇదే స్పష్టంగా కనిపిస్తోంది. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రారు అల్లుడి వద్ద డబ్బులుండగా, తాజాగా పట్టుబడిన కేసులో రైటర్ సహాయకుడి వద్ద డబ్బు లభించింది. ఈ రకంగా తీసుకున్న డబ్బులను విధుల అయిపోయిన తరువాత టీ కేఫ్‌ల్లో పంపకాలు జరుగనున్నట్టు ఆరోపణలున్నాయి. కార్యాలయాల్లో అంతా సాఫీగా నడుస్తున్నట్టు కనిపించినా డబ్బుల వ్యవహారమంతా బయట కేఫ్‌ల్లో సాగుతుంటాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొన్నటి దాకా ...

ఎసిబి వలలో సబ్ రిజిస్ట్రార్



డిప్యూటీ తహశీల్దార్ సీట్‌లో కూర్చోని ఆర్భాటంగా మ్యూటేషన్ పక్రియను చేపడుతున్న ప్రయివేటు వ్యక్తి

తీరుమారని తహశీల్దార్ కార్యాలయం

◆ కొనసాగుతున్న ప్రయివేటు వ్యక్తుల హవా
◆ చిలమత్తూరు 'రెవెన్యూ'పై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

'ఎవరేమనుకుంటే మాకేంటి మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం'. అన్నట్లు తయారైంది చిలమత్తూరు రెవెన్యూ అధికారుల తీరు. రెండు రోజుల క్రితం తహశీల్దార్ కార్యాలయం రికార్డుల గదిలో ప్రయివేటు వ్యక్తులు ప్రవేశించడం వివాదాస్పదం అయ్యింది. దీనిపై పత్రికల్లో వార్తలూ వచ్చాయి. ఉన్నతాధికారులు కూడా ఈ ఘటనపై వివరణ అడిగారు. పరిస్థితి ఇలా ఉన్నా ఇక్కడ అధికారుల తీరు మాత్రం మారడం లేదు. తాజాగా గురువారం నాడు ఓ ప్రయివేటు వ్యక్తి ఏకంగా వీఆర్వో లాగిన్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో మ్యూటేషన్‌కు సంబంధించిన ఫిర్యాదులను సమర్థించడం లేదా తిరస్కరించడం పనులు చేస్తూ విలేకర్లు కంట పడ్డాడు. ఇదేం అని విలేకర్లు తహశీల్దార్‌ని ప్రశ్నిస్తే తహశీల్దార్ కార్యాలయంలో సరిపడా సిబ్బంది లేరని, అందుకే ప్రయివేటు వ్యక్తులను ఉపయోగించుకున్నామని చెప్పారు. ప్రజల స్థిరాస్తులకు సంబంధించి మొదలు కొన్ని కీలకమైన దస్తావేజులు రక్షణ, రికార్డుల నిర్వహణ తదితరం కార్యాలయంలో ఉంటాయి. ఇక భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో మరిన్ని వివరాలు ఉంటాయి. ఇంతటి విలువైన సమాచారం ఉన్న డిప్యూటీ తహశీల్దార్ కంప్యూటర్‌లో ప్రయివేటు వ్యక్తి మ్యూటేషన్ చేయడం వల్ల ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తహశీల్దార్ కార్యాలయంలో ప్రయివేటు వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేగవంతంగా ప్రభుత్వ భవనాల నిర్మాణాలు

రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా అర్జీదారులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జోహార్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. గురువారం నాడు జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం పంచాయతీ రాజ్, వ్యవసాయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. జగనన్నకు చెబుదాం, కార్యక్రమంలో ఎక్కువగా రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, హోం శాఖలు, విద్యుత్తుకు సంబంధించి ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్ ఈ కేవైసీ నమోదు ఈనెల 31వ తేదీకి పూర్తి చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి జగనన్న చేయూత, జగనన్న ఆసరా పథకాల ద్వారా రైతులకు మంజూరు చేసిన పశువుల నుంచి సేకరించిన పాలను అమూల్ కేంద్రాలకు అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ పశు సంచార వాహనాల ద్వారా గ్రామాల్లోని పశువులకు వైద్యం అందించాలన్నారు. 1962 టోల్ ఫ్రీ ద్వారా మెరుగైన సేవలు అందించాలన్నారు. రీ సర్వే రెండవ దశ గ్రామాలకు సంబంధించి నిర్ణీత గడువులోగా త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల పేదలకు తగిన ఉపాధి కల్పించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్





ముదిగుబ్బ, ఓబుళదేవరచెరువు మండలాల్లో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ


పంటసాగు చేసి నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్లో టిడిపి రైతు నాయకులు ఆధ్వర్యంలో ఎన్టీర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం రోడ్డు పై ఆందోళనకు దిగారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్నకుమార్, అగ్రికల్చర్ ఆఫీసర్ నరసింహులుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు రమేష్ బాబు, అన్నమనేని ప్రభాకర్, తుమ్మల మనోహర్, తుమ్మల సూరి, కృష్ణమూర్తి యాదవ్ , తెలుగు మహిళా రాధమ్మ , ధర్మవరం నియోజకవర్గ మండల కన్వీనర్లు గోనుగుంట్ల విజయ్ కుమార్ , కమతం కాటమయ్య, గంటాపురం జగ్గ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : మండలంలో పంటలు నష్టపోయిన రైతులకు బీమా వర్తింపజేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కదిరి హిందూపురం ప్రధాన రహదారిపై టిడిపి నాయకులు కార్యకర్తలు రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెబుతూనే రైతులకు బీమా వర్తింప చేయకుండా అన్యాయం చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు బీమా వచ్చేటట్లు చూడాలని డిమాండ్ చేశారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎఒ ఇలియాజ్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, పీట్ల సుధాకర్, డాక్టర్ జాకీర్, బడిశం రామాంజనేయులు, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్యకార్మికులు, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కార్మికసంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం గాంధీనగర్‌లో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్యకార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉంటూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, కార్మికులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆదినారాయణ, ఆయూబ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, మున్సిపల్ కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, చెన్నకేశవులు, కార్మికులు పుల్లన్న, వెంకటేశ్, లక్ష్మీ ఓబుకేశు, పెద్దక్క, దుర్గమ్మ, నరసమ్మ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మున్సిపల్ పారిశుధ్యకార్మికులు

సహకరించండి.. అండగా ఉంటాం ...

ప్రజాశక్తి - హిందూపురం

వైసిపి అధిష్టానం తన భార్యకు ఆవకాశం కల్పించిందని వచ్చే ఎన్నికల్లో తమకు మైనార్టీ నాయకులు అందరు సహకరించాలని వైసిపి నేత వేణు రెడ్డి మైనార్టీ నాయకులను కలిసి కోరారు. గురువారం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని నివాసంలో పురం మైనార్టీ నాయకులను ఆయన కలిశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులతో పాటు చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, కొటిపి హనుమంత రెడ్డి, ధనంజయ రెడ్డి, శ్రీరామరెడ్డి, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. సాయం అందించారు...

ప్రజాశక్తి - హిందూపురం

పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన రాజు కుమారుడుకాలేయ వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆగ్రోస్ చైర్మేన్ నవీన్ నిశ్చల్ రాజు కుటుంబ సభ్యులను తన కార్యలయానికి గురువారం పిలిపించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన వైద్య సేవల కోసం రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందించారు.

దళితుల జోలికొస్తే ఊరుకోం

ధర్మవరం టౌన్ : దళితుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు వైసీపీ నాయకులను హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులను బానిసలుగా పేర్కొన్న వైసీపీ రాష్ట్ర అధికారప్రతినిది ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కి దళితులపై దాడులు, హత్యలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో దళితులే వైసీపీకి తగిన బుద్ధిచెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గన్ లైసెన్స్ రెన్యువల్ కోసం దరఖాస్తు

పుట్టపర్తి రూరల్: సినీ నటుడు నరేష్ తన గన్ లైసెన్స్ రెన్యువల్ కోసం జిల్లా ఎస్పీ మాధవ రెడ్డిని గురువారం పుట్టపర్తి లోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో కలసి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ మాధవరెడ్డితో పలు విషయాలను చర్చించారు. నక్సల్స్ ప్రభావం ఉన్న తరుణంలో అనంతపురం జిల్లాలో గన్ లైసెన్స్ తనకు మంజూరు అయిందని దానిని ఇప్పుడు రెన్యూవల్ చేయాలని కోరారు. ఈమధ్య తనకు కొందరు వ్యక్తుల నుండి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, అంతేకాక తనకు ప్రాణహాని ఉందని చెప్పారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సినీ నటుడు నరేష్

శ్రీహరికోటకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీహరికోట లో రాకెట్ లాంచింగ్ ను వీక్షించుటకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీహరికోటకు జిల్లా నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ను నడపనున్నట్లు తెలిపారు. కళాశాలల, ఉన్నత పాఠశాలల విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులను శ్రీహరికోటకు పంపడానికి ముందుకు రావచ్చున్నారు. జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర డిపోల నుంచి 13వ తేదీ ఉదయం నాలుగు గంటలకు ఎక్స్ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నామన్నారు. ఆసక్తి గలవారు ఆయా డిపోల కౌంటర్లలో సంప్రదించి ముందుగా బుకింగ్ చేసుకోవాలని ఆయన కోరారు.

ధర్మవరం టౌన్ : ఈనెల 14న శ్రీహరికోటలో చేపడుతున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ -3ను వీక్షించేందుకు ధర్మవరం డిపో నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ మోతిలాల్నాయక్ తెలిపారు. 13వతేదీ రాత్రి 12 గంటలకు బస్సులు ఏర్పాటుచేశామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పని దినాలను సద్వినియోగం చేసుకోండి

పీడీ రామాంజనేయులు

ప్రజాశక్తి బత్తలపల్లి

కూలీల వలసల నివారణ ధ్యేయంగా చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పనిదినాలను సద్వినియోగం చేసుకోవాలని పీడీ రామాంజనేయులు కూలీలకు సూచించారు. గురువారం మండలంలోని ఓబుళాపురం పంచాయతీ కోడే కండ్ల ఎస్సీ కాలనీలో ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు పొందిన ప్రతి కుటుంబం కూలీ పనులకు హాజరు కావాలన్నారు. పనులకు రాని కూలీల జాబ్‌కార్డులను రద్దు చేయాలన్నారు. అడిగిన వెంటనే పనులు కల్పిస్తున్నామన్నారు. వర్షాకాలంలోనూ పనులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అందువల్ల ఎవరూ వలస వెళ్లకుండా వంద రోజులు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీడీ వెంకట చలపతి, ఎపిఒ ఆదెప్ప, సర్పంచు సరస్వతి, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టోతో వైసీపీలో వణుకు

మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-రామగిరి

చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోతో వైసిపి నాయకుల్లో వణుకు మొదలైందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గల తన నివాసంలో కనగానపల్లి మండల నాయకులతో గురువారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్, సెక్షన్ (కుటుంబ సాధికార సారధులు) ఇన్‌ఛార్జులు, టిడిపి నాయకులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన మొదటి మేనిఫెస్టో గురించి వివరించారు. ఇందులో పొందుపర్చిన పథకాల మీద జనంలో చర్చ జరుగుతోందని అన్నారు. నియోజకవర్గంలో భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బస్సు యాత్ర ద్వారా ప్రతి ఇంటికి ఈ మ్యానిఫెస్టోను చేర్చే కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. వీటిని ప్రజలకు వివరిస్తూ వాటి వలన కలిగే లబ్ధి గురించి చెప్పాలన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

గోరంట్ల రూరల్ : మండలంలోని ఎముకుల గుట్లపల్లికి చెందిన దళిత ఓబులేసు అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచి మనీ శివ శంకర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా తక్షణసాయం కింద పదివేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై ర్యాలీ

లేపాక్షి : డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ . చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తిరుమలదేవర పల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శివన్న, పంచాయతీ కారదర్శి రామాంజినేయులు, ఎంపిహెచ్ఒ సుదర్శన్ బాబు, హెల్త్ సూపరవైజర్ గంగాధర్, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి పట్టణానికి చెందిన హసీనా కుమార్తె షాహిదా వివాహం కోసం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ కుటుంబం చేయూతను అందించింది. డాక్టర్ బత్తల హరి ప్రసాద్ తండ్రి మాజీ సర్పంచి బత్తల వెంకట రమణ ద్వారా రూ. 10వేల సాయాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్సూర్ సాహెబ్, శ్రావణ్ కుమార్, బలపపాల చంద్ర, సూరి నేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజీనామా

తనకల్లు : మండల పరిధిలోని చీకటిమాని పల్లి గ్రామానికి చెందిన తనకల్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎన్. ఈశ్వర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పదవీకాలం ముగిసిందని అయితే తిరిగి తన పదవీకాలం పొడిగిస్తామని తెలిపారని చెప్పారు. అయితే తన వ్యక్తిగత కారణాల వల్ల చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని మార్కెట్ యార్డ్ కమిషనర్‌కు పంపినట్లు ఈశ్వరరెడ్డి వివరించారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొత్తచెరువు : మైనార్టీల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ నూరుల్లా తెలిపారు కొత్తచెరువులోని హజరత్ మస్తాన్ వల్లి దర్గా లో హల్ దిల్ మే వైయస్సార్ హంసబ్ జగన్ కే సాద్ అనే కార్యక్రమాన్ని నిర్వహించి పోస్టర్లను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం ఎంతో కషి చేశారన్నారు ఆయన బాటలోనే జగన్మోహన్ రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ మేనేజర్ అతావుల్ రహిమాన్, ముజాహిద్, బాబా ఫక్రుద్దీన్, హరీష్, అహ్మద్, ముతవల్లులు తదితరులు పాల్గొన్నారుజ

రీ సర్వేను వేగవంతం చేయండి

గాండ్లపెంట : రీ సర్వే వేగవంతం చేయాలని తహశీల్దార్ హమీద్‌బాషా ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్లు, వీఆర్వోలు, సచివాలయ సర్వే అసిస్టెంట్లు. సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. ఆర్ఐ మున్వర్, మండల సర్వేయర్ ఆనంద్ నాయక్, వీఆర్వోలు అమానుల్లా, జయరాములు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో షార్ట్ ఫిలిం ఈవెంట్

ముదిగుబ్బ : మండల కేంద్రంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న నరేష్ దర్శకత్వంతో త్రయం షార్ట్‌ఫిలింకు సంబంధించిన ఈవెంట్‌ను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ తనకు మొదటినుండి సినిమాలపై మక్కువ ఎక్కువ అని అన్నారు. డ్యూటీ లేని ఖాళీ సమయంలో తన మిత్రులతో కలిసి నటనపై ఆసక్తి వునసున్న వారితో ఒక యూనిట్‌గా ఈ షార్ట్‌ఫిలిం తీశానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ కంబగిరి రాముడు, షార్ట్ ఫిలింలో నటించిన యువకులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిఐకి సన్మానం

నల్లమాడ : నల్లమాడ సిఐగా బాధ్యతలు చేపట్టిన రాజేంద్ర యాదవ్ ను తెలుగుదేశం పార్టీ నాయకులు సామకోటి ఆదినారాయణ తదితరులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైలే శివశంకర, చిదంబరెడ్డి, నాగభూషణం నాయుడు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు వ్యాధి నివారణ టీకాలు

బత్తలపల్లి : పెంపుడు కుక్కలకు వ్యాధినివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా 46 కుక్కలకు ఉచితంగా టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ డాక్టర్ దివ్య, సిబ్బంది సురేష్, నవీన్, కుక్కల పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి టీ-20 క్రికెట్ టోర్నీ

బత్తలపల్లి : బత్తలపల్లి ఆర్డీటి స్పోర్ట్స్ సెంటర్ నందు ఎఫ్ఎఫ్ (ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్) టీ20 కప్ 2023 క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో విన్సెంట్ టీమ్, అన్నే టీమ్, మాంఛో టీమ్, విశాల టీములు పాల్గొంటాయన్నారు. టోర్నమెంట్ ఫైనల్ రోజున ముఖ్యఅతిథులుగా ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రొగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, ఉమెన్ ఎంపోర్మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, హెడ్‌కోచ్ యుగంధర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

రైతులను నేరస్తులుగా చిత్రీకరించడం బాధాకరం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

పెనుకొండ : రైతులను నేరస్తులుగా చిత్రీకరిస్తూ కేసులు పెట్టడం బాధాకరమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. ఈ మేరకు ఆమె గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో టమోటా, పచ్చిమిర్చి, ఇతర నిత్యావసర ధరలు రోజురోజుకీ విపరీతంగా పెరిగిపోతున్నాయని సామాన్య ప్రజలు కొనలేకపోతున్నారని అన్నారు. వెంటనే రైతు బజార్ల ద్వారా అతి తక్కువ రేటుకే నిత్యావసరకులు సామాన్య ప్రజలకు అందేలా చూడాలని వైసీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉరవకొండలో శాంతియుతంగా రైతులు బీమా అడిగితే వారిని నేరస్తులుగా చూపి అక్రమ కేసులు పెట్టడం దారుణమని అన్నారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కేసులు ఎత్తేయకుంటే రైతులతో కలసి జైలు భరో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, మాజీ జెడ్పీటీసీ రాంపురం సర్పంచి శ్రీనివాసులు, నాయకులు శ్రీరాములు, సూర్యనారాయణ, త్రివేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు



సిడిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, అంగన్వాడీ నాయకులు

ఆందోళనకు అనుమతి ఇవ్వండి

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఈ నెల 10, 11వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామని, ఈ ఆందోళనకు అనుమతులు ఇవ్వాలని ఐసిడిఎస్ సిడిపిఒ రెడ్డి రమణమ్మను సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతు 10, 11వ తేదిల్లో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో అంగన్వాడీ వర్కర్లు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శోభారాణి, ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీష, సెక్టార్ లీడర్లు శైలమ్మ, విజయమ్మ, వరలక్ష్మి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఉర్దూపాఠశాలలో గత నెల 29వతేదీ జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. బాదేసాబ్ వీధికి చెందిన నల్లపోతుల ముత్యాలు, లోనికోటకు చెందిన అవుకు మాహిన్ ఖాన్, జావేద్ గత నెల 29వతేదీ రాత్రి లోని కోటలోని ఉర్దూ స్కూల్లో చోరీ చేశారన్నారు. పాఠశాల హెచ్ఎం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం చెరువు మొదటి మరువ వద్ద వారు ఉన్నట్టు సమాచారం రావడం తో తాను తన సిబ్బంది రాజప్ప, ఉమాశంకర్లతో కలిసి వెళ్లి నల్లపోతుల ముత్యాలు, మాహిన్‌ఖాన్‌ను అరెస్టు చేశామన్నారు. వారివద్ద నుంచి హోండా స్కూటీ, 6, బ్యాటరీలు, కంప్యూటర్ 1, ప్రొజెక్టర్ 1, స్పీకర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు.

'పురం'జిల్లా ఆసుపత్రి వద్ద ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని హస్నాబాద్‌కు చెందిన అల్లాబకాష్ (60) అనే వ్యక్తి తీవ్ర తలనొప్పితో బాధపడుతూ బుధవారం రాత్రి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఇంటికి వెళ్లిన కొంత సమయానికి అల్లాబకాష్ మృతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వేసిన ఇంజక్షన్ వికటించి అల్లాబకాష్ మృతిచెందాడని మృతుని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపిస్తూ మృతదేహాన్ని తీసుకొని హాస్పిటల్ వద్ద నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మెడికల్ సుపరింటెండెంట్ రోహిల్ కుమార్ అక్కడికి చేరుకుని సమస్యను అడిగి తెలుసుకున్నారు. వేసిన ఇంజక్షన్ వల్ల మృతి చెందడానికి అవకాశం లేనదని, రియాక్షన్ అయితే ఒంటి మీద దద్దుర్లు వస్తాయని చెప్పారు. దీనిపై నమ్మకం లేకుంటే మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహిస్తామని అందులో ఇంజక్షన్ రియాక్షన్ జరిగినట్లు తేలితే తమ సిబ్బందిపై చచర్యలు తీసుకుంటామన్నారు. అయితే దీనికి మృతుని బంధువులు అంగీకరించకుండా మృత దేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

కౌన్సిలర్ ఆర్థికసాయం : అల్లాబకాష్ మరణ వార్త తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్యకు రూ. 10వేలు ఆర్థికసాయం అందించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బత్తలపల్లి : మండలంలోని తంబాపురం గ్రామానికి చెందిన వ్యక్తి అప్పులబాధతో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు సంబందించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.... గ్రామానికి చెందిన వీరనారప్ప (57) తన కుమారుడు, కుమార్తె వివాహాలకు, గృహ నిర్మాణానికి, ఇతర కుటుంబ అవసరాలను అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తరచూ మధనపడేవాడు. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి ఇంటిలో ఎవరికి చెప్పకుండా బత్తలపల్లికి వచ్చి ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయం సమీపంలో ఊజీ మాత్రలు మింగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. వెంటనే ఆర్డీటి ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సకు సహకరించక గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహర్ష తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రైతుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద శుక్రవారం చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఉన్న అధికార పార్టీ ప్రతినిధులు రైతుల కోసం స్పందించాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి ఈనెల 8న కల్యాణదుర్గం వస్తునందున కరువు జిల్లా అయిన ఉమ్మడి జిల్లా ప్రతినిధులు ముఖ్యమంత్రిని ఒప్పించి బీమా వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగే ధర్నాలో టిడిపి శ్రేణులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పల్లె పిలుపునిచ్చారు.

నల్లమాడ : వాతావరణ బీమా మంజూరులో రైతులకు జరిగిన అన్యాయనికి నిరసనగా సత్య సాయి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు కోరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మైలే శివశంకర, బీసీ సెల్ నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు తెలిపారు. ఈ ధర్నాలో రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బుక్కపట్నం : సత్య సాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించే ధర్నాలో జిల్లాలోని రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ,మండల కన్వీనర్ మల్లి రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు సమస్యలపై నిర్వహిస్తున్న ఈధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలు, టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు, మాజీ ఎంపీటీసీ జయరాం, నాయకులు వాజిద్‌బాషా, సుధీర్, నాగభూషణం, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

8న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఈనెల 8న మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, ప్రిన్సిపల్ ఫణికుమార్ కోరారు. ఈ మేరకు గురువారం కళాశాలలో మేళాకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదలచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జాబేళాలో ప్రముఖకంపెనీలైన టెక్ మహేంద్ర, డబ్ల్యూఎన్ఎస్, స్టార్ హెల్, ఇన్సూరెన్స్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తీ చేసిన విద్యార్థులతోపాటు, ప్రస్తుత ఏడాది తతియ సంవత్సరం డిగ్రీచదివే విద్యార్థులు కూడా పాల్గొనవచ్చున్నారు.

సెమిస్టర్ ఫీజులు తగ్గించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఈ ఏడాది పెంచిన డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫీజులను తగ్గించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కేయూ యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాలలకు చెందిన విద్యార్థులకు రూ. 550 ఉన్న ఫీజులను ఏకంగా రెండింతలు పెంచడం అన్యాయమన్నారు. జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయల్లో యూనివర్సిటీకి పరీక్షల ఫీజుల రూపంలో చెల్లించాల్సి వస్తోందన్నారు. విద్యార్థులు జీవితాలను నాశనం చేసే పద్ధతిలో ఎస్కే యూనివర్సిటీ వెళుతోందని విమర్శించారు. వెంటనే పెంచిన ఫీజులను తగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోనాయకులు ఆనంద్, చైతన్య, వెంకటేష్ నాయుడు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బత్తలపల్లి : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గురువారం బత్తలపల్లిలో నిర్వహించిన గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమంలో ఆయనతో పాటు ఏపీ కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం

ప్రజాశక్తి - రొళ్ల

స్థానిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పూర్తయి ఆరు నెలలు గడిచినా ఇప్పటిదాకా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం వైద్యసేవలు అందిస్తున్న ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. కాలం గడిచే కొద్ది వైరింగ్ సదుపాయం కూడా పూర్తిగా దెబ్బ తినడంతో రెండు రోజుల నుంచి కరెంటు లేక అంధకారంలో వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నాఉ. ఫ్యాన్లు కూడా పనిచేయకపోవడంతో దోమల బెడద ఎక్కువై రోగులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైద్య అధికారులు రోగులకు వైద్యం అందించాలన్నా ఇబ్బందిగా మారింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గదులన్నీ జలమయమయ్యాయి. దీంతో రోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై వైద్య అధికారిని సుజన మాట్లాడుతూ ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లించకపోవడంతో ప్రారంభం జాప్యం జరుగుతోందని అన్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో సరైన సదుపాయం లేక రోగులకు వైద్యం అందించాలంటే ఇబ్బందికరంగా ఉందన్నారు.



ప్రారంభం కాని రొళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం

ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి

ప్రజాశక్తి - పెనుకొండ

పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి ఎమ్మెల్యే శంకర్ నారాయణ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు పార్థసారథి అల్లుడు శశిభూషన్ ఆధ్వర్యంలో బాబు జగజీవన్ రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలడుగు చంద్రశేఖర్, కన్నా స్వామి, పుల్లగూర శ్రీనివాసులు, రామలింగ, ఖన్నా, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతిని హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగజ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పంచ్ ప్రభాకర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ సర్కిల్ లో నిరసన తెలిపారు.పంచ్ ప్రభాకర్ ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తీక్, డి ఎస్ పి హుస్సేన్ పీరాకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో వెంకటేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని డిఎచ్‌పిఎస్ కార్యాలయంలో ఆసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంఆర్. హనుమంతు ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బిఎల్ శివ, వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : డాక్టర్ బాబుజగ్జీవన్ రావు వర్ధంతి వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఐసిఐసిఐ బ్యాంక్ ఎదుట ఉన్న జగ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు బూదెప్ప, రామాంజినేయులు, శివప్రసాద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి తన కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కషి చేద్దామని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. గురువారం జగజ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని అంబేద్కర్ భవన్ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి వివిద దళిత, ప్రజా సంఘాల అధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. వైసిపి ఆధ్వర్యంలో వేణురెడ్డి, వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరామిరెడ్డి, ఆనంద్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం



సోమందేపల్లిలో ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే



ధర్మవరంలో ధ్రువపత్రం అందజేస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి - పెనుకొండ

అర్హులందరికీ న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్నిచేపట్టారని పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుట్టూరు సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని చెప్పారు.అనంతరం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : ప్రజల సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష మార్గమని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో సచివాలయం 1, 2 లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న వారిని ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రూప, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రవిశేఖర్ రెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ కాచర్ల లక్ష్మీ పేర్కొన్నారు. గురువారం శాంతినగర్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది వరకే 11రకాల సర్టిఫికెట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికి సర్టిఫికెట్లను ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, కమిషనర్ బండిశేషన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చెలిమి రామకృష్ణమ్మ, వార్డు ఇన్‌ఛార్జులు చెలిమిపెద్దన్న, శంకరయుగంధర్, దాసునాయక్, నాయకులు బైముతక రమణ, టిపిఒ సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

రొళ్ల : జగనన్న సురక్షలో భాగంగా గురువారం మండల పరిధిలోగల కాకి గ్రామంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అలాగే ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మురళీమోహన్, ఎంపీడీవో ఆజాద్, సర్పంచి లక్ష్మమ్మ, ఎంపీటీసీ లక్ష్మీ ఎర్రగుంటేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని ఆర్డీవో భాగ్యరేఖ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారు నమోదు చేసుకోవచ్చునని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, సర్పంచి మంగ్లీ బాయ్, మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్బదాస్, తహశీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డితో పాటు ఆయాశాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : తాడిమర్రి మండలంలో జగనన్న సురక్ష పథకం కింద వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గురువారం యం.అగ్రహారం సచివాలయం లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి పాటిల్ భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

సోమందేపల్లి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకర్ నారాయణ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ న్యాయం జరగాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం అర్హులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాదేవి నరసింహామూర్తి, ఉప సర్పంచి వేణు, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, జెడ్పీటీసీ డిసి అశోక్, కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య తదితర నాయకులు, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని పులిమితి గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, స్థానిక సర్పంచి అశ్వత్ నారాయణ, వైస్ ఎంపీపీ ఆంజినరెడ్డి, కన్వీనర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని 21, 32, 34, 35, 36, 37, 38, 42వ సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ హసీనా సుల్తానతో ఆయా వార్డుల కౌన్సిలర్లు హాజరయ్యారు. అనంతరం వివిధ వార్డుల్లో 3412 దృవికరణ పత్రాలను అర్హులకు అందించారు.